నేల రాలుతున్న ఆశలు..!

- వర్షాలతో శనగపంటకు తెగుళ్లు
- రాలిపోతున్న పూత
- ప్రతికూల వాతావరణంతో దిగుబడి తగ్గే ప్రమాదం
- ఆందోళనలో అన్నదాతలు



ఎర్రగుంట్ల మండలంలో పప్పుశనగ పంట

ఎర్రగుంట్ల : మండలంలో సాగు చేసిన పప్పుశనగ పంట పూత దశలో ఉంది. ఇదే దిగుబడికి అత్యంత కీలక సమయం. ఈ నేపథ్యంలో ప్రతికూల వాతావరణం ఏర్పడటంతో పూత రాలిపోతోంది. వరుస వర్షాలతో భూమిలో తేమశాతం పెరగటం, ఆకాశం మేఘావృతమవుతుండటంతో పప్పుశనగ పంటకు వేరుకుళ్లు, ఆకుమాడు తెగుళ్లు సోకాయి. దీంతో కొన్ని ప్రాంతాల్లో పప్పుశనగ మొక్కలు చనిపోతున్నాయి. ఈ సారి దిగుబడి వస్తుందని ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. మండల పరిధిలో సుమారు 4,900 హెక్టార్లల్లో రైతులుపప్పు శనగ సాగు చేశారు. పొగ మంచుతో పంటకు పెద్దగా నష్టం లేక పోయిన వర్షాలతో ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

ఒకసారి పూత రాలిపోయినా వాతావరణం మళ్లీ అనుకూలిస్తే మరోసారి పూత వచ్చే అవకాశం ఉందనీ, అయినా దిగుబడి సగానికిపైగా పడిపోయే పరిస్థితులున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. రెండోసారి పూత వచ్చినా కాయలు నాణ్యంగా ఉండేది కష్టమనే రైతులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా రబీలో శనగనే నమ్ముకున్న రైతులు ధర లేక ఇబ్బందిపడుతూ వచ్చారు. ఈ ఏడాది విత్తనం వేసిన నెలలోగా వర్షాలకు పంట దెబ్బతినిపోయింది. వేలాది రూపాయల పెట్టుబడి నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులన్నా వస్తాయా..? లేదా..? అనే ఆందోళనలో ఉన్నారు. సన్న, చిన్నకారు రైతులు అప్పులు చేసి పంట సాగు చేశారు. తెగుళ్లు సోకకుండా వేలాది రూపాయలుఖర్చు చేసి మందులు పిచికారి చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



30 ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.15 వేలు ఖర్చు పెట్టాను. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ సారి వరుస వర్షాలు, వాతావరణ పరిస్థితుల మూలంగా పంటను కోల్పోవాల్సి వస్తోంది. తొలి పూత రాలిపోవటంతో దిగుబడి రావడం కష్టమే. ప్రభుత్వం స్పందించి, ఆదుకోవాలి.

–చింత వెంకటక్రిష్ణయ్య, రైతు , యర్రగుంట్ల పట్టణం

పూత ఆలస్యంగా వస్తుంది



మండల వ్యాప్తంగా 4,900 హెక్టార్లల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం అక్కడక్కడ పూత వచ్చింది. కొన్ని చోట్ల ఆలస్యంగా పూత వస్తుంది. తుపాన్ వస్తుందని వాతావరణ శాఖ చెబుతోంది. రైతులు ముందస్తుగా ఎగ్జికోనోజోల్ మందును లీట ర్‌నీటిలో రెండు ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి.

–శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, యర్రగుంట్ల మండలం

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

వేంపల్లె : స్థానిక శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానమైన ఆంజనేయ స్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ ధనుర్మాస పూజల్లో స్వామివారు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. శ్రీవృషభాచలేశ్వర స్వామి రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు హరి ప్రవీణ్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకం, నక్షత్ర హారతి, కుంభ హారతి, మంత్రపుష్పం, మహా మంగళహారతి, తదితర విశేష పూజలు నిర్వహించారు. ప్రతి రోజు తెల్లవారుజామున 5గంటలకు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పూజలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని భాకరాపురం రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయం, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గోత్ర నామాలతో ఉభయదారులచే పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని వెలమవారిపల్లె గ్రామంలో ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం, నవధాన్య అభిషేకం, బిల్వార్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివార్లను భక్తులు దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు.



పులివెందుల టౌన్ : ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



వేంపల్లె : రాజమన్నార్ అలంకారంలో శ్రీవృషభాచలేశ్వరస్వామి

క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం చెన్నారెడ్డి కాలనీ, నగరిగుట్ట సచివాలయాల పరిధిలోనూ, 18న ప్రశాంతినగర్, మున్సిపల్ మస్టర్ ఆఫీస్ ప్రాంతాల్లోనూ, 19వ తేదీన పెద్దకొండప్ప కాలనీ, భాకరాపురం సచివాలయాల్లోనూ, 20న ఉలిమెల్ల సచివాలయం, రాజీవ్ కాలనీ సచివాలయాలలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, బాల, బాలి

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటోలను మార్పు చేయుట, ఫోన్ నంబర్ లింక్ చేయుట, వేలి ముద్రలు అప్డేట్ చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



మహాకుంభ నివేదనలో సోమేశ్వరస్వామి

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామ సమీపంలో ఉన్న ప్రముఖ భానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమేశ్వరస్వామికి వైభవంగా ఆరుద్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సురేష్ శర్మ, బద్రి శర్మ స్వామివారికి రుద్రాభిషేకం, మహా కుంభ నివేదన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంభం మహేశ్వరరెడ్డి, ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బీమా నమోదు గడువు పెంపు

కమలాపురం: పంటల బీమా నమోదు గడువు ఈ నెల 30వ తేదీ వరకు పెంచినట్లు మండల ఏఓ సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ 2024–25లో సాగు చేసిన పంటలకు సంబంధించిన బీమా ప్రీమియం ఈ నెల 15 వరకు చెల్లించాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే గడువు పూర్తి కావడంతో ఇంకా బీమా ప్రీమియం చెల్లించని రైతుల కోసం 30వ తేదీ వరకు గడువును పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని ఆమె సూచించారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జమ్మలమడుగు: క్రిస్మస్ సందర్భంగా మండల పరిధిలోని పొన్నతోట ఆర్‌సీఎం చర్చి పరిధిలో ఉన్న పేదలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం పోరుమామిళ్లలోని చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్ సహకారంతో ప్రత్యేక కార్యక్రమాన్ని చర్చిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్, చిత్తా దంపతులు 145 మందికి నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : మండలంలోని నందిపల్లి గ్రామంలో వెలసిన నందీశ్వరాలయ కొత్త సంవత్సర క్యాలెండర్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని భాకరాపురంలోని ఎంపీ నివాసంలో నందిపల్లి గ్రామ శ్రీ శివాలయం డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మారం శ్రీకాంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిచే ప్రారంభించారు. నందిపల్లి గ్రామానికి చిహ్నంగా నందీశ్వరుని విగ్రహం ఏర్పాటు చేశామని, అలాగే నందీశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మారం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆలయానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రాము, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

వల్లూరు: మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం తోల్లగంగనపల్లె, బుధవారం అంబవరం, 19న గోటూరు, 20 న వల్లూరు, 26 న ఆదినిమ్మాయపల్లె, 27న తప్పెట్లలో మొబైల్ ఆధార్ సేవలు అందుబాటలో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

లింగాల : మండల కేంద్రమైన లింగాల వనంబావి శివాలయం వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయంలో ఆదివారం రాత్రి ఆరాధన, జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతులను ఎత్తుకుని ఆలయం చుట్టూ తిరిగారు. అర్ధరాత్రి 12గంటలకు కాశిరెడ్డి నాయన జ్యోతిని ఎగురవేసి జ్యోతుల ఉత్సవాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శనలు, పాటల కచేరి భక్తులను అలరించాయి. నెల్లూరుకు చెందిన సాయి ఈవెంట్స్ వారిచే నిర్వహించిన ఆర్కెస్ట్రా ప్రజలను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో మండలంలోని లింగాల, గుణకణపల్లె, రామట్లపల్లె, మురారిచింతల, ఎగువపల్లె, దిగువపల్లె, పెద్దకుడాల, బోనాల, కర్ణపాపాయపల్లె, కోమన్నూతల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కాశిరెడ్డినాయన జ్యోతిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.



లింగాల: కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జ్యోతులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వీరపునాయునిపల్లె: మండలంలోని ఎన్ పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన ఆరాధన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వేంపల్లె పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూలు విద్యార్థులు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకొన్నారు. అంతే కాకుండా శ్రీదేవి డ్రామా కంపెనీ జూనియర్స్ విభాగానికి చెందిన నటుల డ్యాన్స్ ఆకట్టుకుంది. ఆరాధనోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.




వీరపునాయునిపల్లె: శివపార్వతుల వేషధారణలో నృత్యం చేస్తున్న చిన్నారులు

వెండి మబ్బుల సోయగాలు



వెండి మబ్బుల సోయగాలతో ఆకాశం పరవశించింది. మబ్బుల మాటున తేలియాడుతూ కనువిందు చేసింది. ఈ సుందర దృశ్యాలు జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న పెన్నానది సమీపంలో ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. వాటిని ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లతో బందించారు. –జమ్మలమడుగు



నేటి నుంచి శిక్షణా తరగతులు

వీరపునాయునిపల్లె: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిపై మండల పరిషత్ సభా భవనంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొదటి విడతలో వెల్ఫేర్, ఇంజినీరింగ్, డిజిటల్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. రెండవ విడతలో సర్పంచులు, సర్వేయర్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌ఓలు, మహిళా పోలీసులు మరియు అన్ని శాఖల మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో పిచ్చిమొక్కల తొలగింపు



శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరంగనాథ ట్రస్ట్ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివశంకర్ సొంత ఖర్చులతో ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. సోమవారం శ్రీరంగనాథ స్వామి ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, సీఈఓ అల్లం రంగనాయకులు పర్యవేక్షణలో పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, శ్రీరంగనాథ ట్రస్ట్ సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

జమ్మలమడుగు రూరల్: మండల పరిధిలోని ఎస్. ఉప్పలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి (44) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున గుండెనొప్పితో ఆయన ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు, స్థానికులు వచ్చి పలకరించినా పలకలేదు. దీంతో వైద్యుడికి సమాచారం అందించారు. పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాసమూర్తికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెవెన్యూ సిబ్బంది, శ్రీనివాసమూర్తి మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

వీరపునాయునిపల్లె: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. సోమవారం మడలంలోని కొమ్మద్ది గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను నేరుగా సదస్సు దృష్టికి తీసుకురావొచ్చన్నారు. రైతుల ఫిర్యాదులను పరిశీలించి 40 రోజుల్లో పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మిదేవికి సూచించారు.

చిన్నరంగాపురంలో రెవెన్యూ సదస్సు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నజీర్ అహ్మద్ ప్రజలు, రైతుల నుంచి సమస్యలతో పాటు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకాంపల్లిలో..



రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని చిన్నకాంపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మూడు అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అలాగే చిన్నకాంపల్లె,పెద్దకాంపల్లి ప్రజలు తమకు వ్యవసాయ భూములు కేటాయించాలని తహసీల్దారును అభ్యర్థించారు. ఈ సదస్సులో తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. మంగళవారం తాడిగొట్ల గ్రామానికి సంబంధించిన భూ సమస్యలపై తాడిగొట్ల గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

వల్లూరు: సాగులో సమగ్ర సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఊటుకూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని దిగువపల్లె గ్రామంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా ఊటుకూరు ఏరువాక కేంద్రానికి అనుసంధించిన విద్యార్థులు ఒంటిమిట్ట మండలంలోని సీ కొత్తపల్లె, మలకట పల్లె, వల్లూరు మండలంలోని దిగువపల్లె గ్రామాలలో 3 నెలల పాటు రైతులతో కలిసి వ్యవసాయం మరియు అనుబంధ రంగాల కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొని అనుభవాన్ని పొందారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా దిగువపల్లెలో వ్యవసాయ ప్రదర్శనతో బాటు రైతు సదస్సును ఏర్పాటు చేశారు. వ్యవసాయ ప్రదర్శనలో విద్యార్థులు నేల కోత, సమీకృత వ్యవసాయ పద్ధతులు, డ్రోన్‌ల వినియోగం, అడవి పందుల నుంచి పంటలను కాపాడుట, బిందు, తుంపర సేద్యం మొదలైన అంశాలను వివిధ రకాల మోడల్స్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య కుమార్ వ్యవసాయ పంటల్లో రైతులు ఎదుర్కొనే సమస్యలకు తగిన సూచనలు, సలహాలను అందించారు. సాగుకు సంబంధించి రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానిచ్చారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సాయి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో 2012-13 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో 2012– 13 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం ఘనంగా జరిగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల పట్ల ఉన్న బంధాన్ని నిలబెట్టుకోవాలని, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులకు గుర్తుగా కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి బహుమతులు అందజేశారు.

సంపద కరిగింది.. చెత్త మిగిలింది!



నిరుపయోగంగా చెత్త తయారీ కేంద్రం



శిథిలావస్థలో తొట్లు

- పారిశుద్ధ్యం అధ్వానం
- పట్టించుకోని అధికారులు

ముద్దనూరు: ముద్దనూరులో పారిశుద్ధ్యం మెరుగుదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వాటి ద్వారా చెత్తను సేకరించి కేంద్రాల్లో కంపోస్టు ఎరువులు తయారుచేసి, రైతులను విక్రయించాల్సి ఉంది. గ్రామాల్లో పరిశుభ్రం, వర్మీ కంపోస్టులకు మంచి డిమాండ్ ఉంది. అయినా వాటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ కేంద్రాల నిర్వహణకు అప్పట్లో గ్రీన్ అంబాసిడర్‌లను కూడా నియమించారు. ఆరు నెలలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

పడకేసిన పారిశుద్ధ్యం

చెత్త సంపద కేంద్రాలు వినియోగంలో లేకపోవటంతో ప్రజలు ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు అంటువ్యాధులు ప్రబలుతాయామోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు వృధాగా పడి ఉండటంతో అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అలంకారప్రాయంగా ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై తక్షణం స్పందించి అధికారులు చెత్త నిర్వహణపై పూర్తిస్థాయిలో దష్టి సారించి ప్రజలు రోగాలు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల రూరల్ : గ్రామాల్లో సీజనల్, అంటువ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని సుంకులమ్మపేటలో దోమల నివారణకు చేపడుతున్న ఏసీఎం పిచికారి కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త గ్రామాలను సందర్శించి లార్వా, దోమల సర్వే నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్నవారికి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే సూపర్ వైజర్‌కు కానీ, వైద్యాధికారి సమాచారం ఇవ్వాలని సూచించారు.